# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక








అమలాపురం | సంపుటి : 10 సంచిక : 20 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | బుధవారం 12 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 20 12-03-2025 Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## ఇక జిల్లాకో ప్రత్యేక అధికారి..

**సరికొత్త పాలనా వ్యవస్థకు సిఎం చంద్రబాబు శ్రీకారం...**

**ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ, అమలు బాధ్యతలు...**

అమరావతి మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతా కార్యక్రమాల్ని సమర్ధంగా అమలు చేసేందుకు, పరిపాలనను బలోపేతం చేసేందుకు, వివిధ శాఖల మధ్య సమన్వయంతో సమస్యల సత్వర పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారుల్ని జిల్లాలకు ఇన్చార్జులుగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారులను జోనల్ ఇన్చార్జులుగా నియ మించింది.

**జిల్లా ఇన్చార్జులుగా నియమించిన అధికారుల బాధ్యతలు**

ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో పాల్గొని జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులకు సహాయకారిగా ఉండాలి. 15 రోజులకోసారి జిల్లా అధికారులతో సమీక్ష

- తరువాయి 2లో..

# నా జీవితంలో రాజకీయ కక్షలనేవి ఉండవు

### ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




తన జీవితంలో రాజకీయ కక్షలనేవి ఉండవని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. "వైకాపా ప్రభుత్వ హయాంలో పార్టీ కార్యాలయాలపై దాడి జరిగింది. ప్రజాస్వామ్యంలో పార్టీ ఆఫీసులపై ఎప్పుడూ దాడి జరగలేదు. శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే మాత్రం ఉపేక్షించను. కొంతమంది గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాం. 'ఈగల్' అనే ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చాం. గంజాయి పండించి ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దు. ఎట్టి పరిస్థితుల్లో ఒక్క ఎకరాలో కూడా గంజాయి పండించకుండా చర్యలు తీసుకుంటాం. గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం చేస్తున్నాం.. ఆపేదే లేదు" అని సీఎం స్పష్టం చేశారు.

"కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటే కచ్చితంగా శాంతిభద్రతలు అదుపులో ఉండాల్సిందే. ముఠాలు, కుమ్ములాటలు, రౌడీలను అణచివేస్తాం. అటవీ భూములను కూడా అక్రమించేసిన పరిస్థితి గత ప్రభుత్వ

- తరువాయి 2లో..

## సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ బాధ్యతలు



అమరావతి మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సుప్రీంకోర్టు నూతన జడ్జిగా జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ బాధ్యతలు చేపట్టారు. సుప్రీంకోర్టు కొలిజియం జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీను ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో తాజాగా ఆయన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన కలకత్తా జడ్జిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు.

## జనసేన ఆవిర్భావ సభ ప్రాంగణాన్ని పరిశీలించిన శ్రీ నాదెండ్ల మనోహర్



పిఠాపురం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద మార్చి 14వ తేదీన నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభ ప్రాంగణాన్ని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. సభా స్థలిలో ఏర్పాటు చేస్తున్న లైటింగ్, సౌండ్ కి సంబంధించి చర్చించారు. సంబంధిత బాధ్యతలు చూస్తున్నవారితో చర్చించారు. అదే విధంగా వేదిక నిర్మాణాన్ని పరిశీలించారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ శ్రీ కళ్యాణం శివ శ్రీనివాస్ కి సూచనలు చేశారు. ఈ పరిశీలనలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్ గారు, శాసన మండలిలో ప్రభుత్వ విప్ శ్రీ పిడుగు హరిప్రసాద్ గారు, కాకినాడ ఎంపీ శ్రీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ గారు, శాసన సభలో ప్రభుత్వ విప్ లు శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ గారు, శ్రీ అరవ శ్రీధర్ గారు పాల్గొన్నారు.

**సభా ప్రాంగణంలో ఆతిధ్య సమన్వయంపై దృష్టి**

ఆవిర్భావ సభకు హాజరయ్యే అతిధులను సమన్వయపరచడంపై చర్చించారు. ప్రాంగణంలో

- తరువాయి 2లో..



### ప్రకటనలకు ప్రభుత్వ నిధుల దుర్వినియోగం..

## బాధ్యులపై చర్యలు తప్పవ్

**మంత్రి పార్థసారథి**

అమరావతి మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వార్తా పత్రికల్లో ప్రభుత్వ ప్రకటనలపై ఏపీ శాసన మండలిలో ఛైర్మన్ మోషేనురాజు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. తెదేపా ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సాక్షి పత్రికకు రూ.400 కోట్లు చెల్లించారని చెప్పారు. దీనిపై విచారణకు సభా సంఘం వేయాలని మండలి ఛైర్మన్‌ను ఆయన కోరారు.



వివరాలు 2లో..

## అంగన్వాడీలకు అన్యాయం

### కూటమి ప్రభుత్వంపై షర్మిల మండిపాటు



విజయవాడ, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వారికి తీరని అన్యాయం చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. మాట తప్పి మోసం చేయడం అంటే ఇదేనని.. తమ గోడు వినిపించాలనుకున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ నిర్బంధించడం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. వారి గొంతు నొక్కి, ఆందోళలను అణిచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు పరాకాష్ట అని అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవని.. వెంటనే వారిని పిలిచి ప్రభుత్వం చర్చలు జరపాలని షర్మిల డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు నెలకు గౌరవ వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, తక్షణం గ్రాట్యూటి చెల్లింపు హామీని అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా పరిగణించాలని, హెల్పర్ల పదోన్నతిపై నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని.. విధి నిర్వహణలో అంగన్‌వాడీలు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు మట్టి ఖర్చుల కింద రూ. 20 వేలు ఇవ్వాలన్నారు. వీటితో పాటు ఇతర 12 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై ప్రకటన చేయాలని.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వైఎస్ షర్మిల అన్నారు.



## స్కూళ్లకు కొత్త యూనిఫామ్..

అమరావతి మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ: వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం (జూన్ 12) నుంచి స్కూల్ యూనిఫామ్లు మారనున్నాయి... కొత్త యూనిఫామ్లకు మంత్రి లోకేశ్ ఆమోదం తెలిపారని MLA ఆదిరెడ్డి శ్రీనివాస్ ట్వీట్ చేశారు... ఏ రాజకీయ పార్టీలకు సంబంధించిన రంగులు, గుర్తులు లేకుండా రూపొందిం చిన ఈ దుస్తులు చూడముచ్చ టగా ఉన్నాయని పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లో భాగంగా స్టూడెంట్లకు యూనిఫామ్, బ్యాగు, బెల్ట్ ప్రభుత్వం ఉచితంగా అందించనుంది...

### 30 వేల మంది

## పైలట్లు అవసరం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**దిల్లీ: భారత్‌లో పౌర విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోంది. ప్రయాణికుల సంఖ్య ఏటికేడు పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా విమానాలను సైతం ఆయా సంస్థలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో రాబోయే రోజుల్లో పైలట్లు కూడా పెద్ద సంఖ్యలో అవసరమవుతారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రాబోయే 15-20 ఏళ్లలో సుమారు 30వేల మంది పైలట్లు అవసరం పడతారని పేర్కొన్నారు. 200 శిక్షణ విమానాల కొనుగోలుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు.**

దేశీయంగా 800కు పైగా విమానాలు సేవలందిస్తున్నాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం 6,7 వేల మంది పైలట్లు పనిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వివిధ కంపెనీలు 1700కు పైగా విమానాలకు ఆర్డర్ పెట్టాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అవి సేవలందించబోతున్నాయన్నారు. దీంతో రాబోయే 15-20 ఏళ్లలో 30 వేల మంది

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## జయహో..

ప్రపంచకప్‌గా భావించే 'చాంపియన్స్ ట్రోఫీ'లో భారత దేశం అప్రతిహత విజయం సాధించడం మనందరికీ గర్వకారణం. చాంపియన్స్ ట్రోఫీలో ఒక్క పరాజయాన్ని కూడా చవి చూడకుండా ఇంత పెద్ద విజయాన్ని దేశానికి అందించిన టీమిండియాకు జయహోలు చెప్పాలి. గెలుపును యావత్ దేశం ఆస్వాదించింది. పుష్కర కాల విరామం తర్వాత చాంపియన్స్ ట్రోఫీ మళ్లీ మన సొంతమవ్వడం%ౌ%ముచ్చటగా మూడోసారి ఆ ట్రోఫీని ముద్దాడిన తొలి జట్టుగా భారత్ నిలబడిన చారిత్రాత్మక సందర్భాన్ని కుల,మతాలతో సంబంధాలు లేకుండా ప్రతి భారతీయుడు జేజేలు పలుకుతున్నారు. అదే సమయంలో భోపాల్‌లో చోటుచేసుకున్న సంఘటన ఆనందాన్ని కాస్త ఆవిరి చేసింది. గెలుపు ద్వేషానికి దారి తీయకూడదు. కొన్ని సందర్భాల్లో అభిమానులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరమే కాదు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మొన్న ఆదివారం భోపాల్ జామా మసీద్ వద్ద విజయోత్సవ ర్యాలీ కాస్తా మతం రంగు పులుముకుంది. విజయోత్సవం మాటున హిందూమతోన్మాదులు ఈ దాడులకు తెగబడ్డారని, మధ్యప్రదేశ్‌ను మరో ఉత్తర ప్రదేశ్‌గా మార్చే కుట్ర ఇది అని ఎవరికైనా అర్థమౌతుంది.

ఇంగ్లాండ్‌పై టీ20, వన్డే సిరీస్‌లు సాధించినప్పటికీ.. టెస్టు సిరీసుల్లో వరుసగా పరాజయాలు ఎదుర్కొన్న టీమిండియా.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలుస్తుందని తొలుత ఎవరి ఊహల్లోనూ లేదు. ఇతర జట్లూ బలంగానే ఉన్నాయి. ఆతిథ్య హోదాలో బరిలోకి దిగిన డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్థాన్ నుంచి ప్రమాదం పొంచి ఉందనేది విశ్లేషకుల వాదన. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో భారత మేనేజ్‌మెంట్ ప్రయోగాలు చేయడంతో మళ్లీ '2007' రిపీట్ అవుతుందా? ఓవైపు సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్.. మరోవైపు ఆస్ట్రేలియాలో బోర్డర్-గావాస్కర్ ట్రోఫీలో ఓటమి.. ఇలా వరుస పరాభవాలతో రెండు నెలల కిందట టీమిండియాపై ఎన్ని విమర్శలో! ఇన్ని సందేహాల నడుమ ఏ మాత్రం ఆత్మస్థైర్యం కోల్పోకుండా బరిలోకి దిగిన భారత జట్టుకు కోచ్‌గా గౌతమ్ గంభీర్ %-% కెప్టెన్‌గా రోహిత్ ద్వయం చేసిన ప్రయోగాలే విజయానికి పునాదులయ్యాయి. అరబ్ గడ్డపై అజేయంగా దూసుకెళ్తున్న రోహిత్‌సేన ఆఖరి ఆటలోనూ అదే హవా కొనసాగించి దుబారులో తీన్మార్ కొట్టింది. భారత స్పిన్నర్ల ధాటికి తక్కువ స్కోరుకే తోకముడిచిన కివీస్.. అనంతరం ఛేదనలోనూ రోహిత్ శర్మ కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు శ్రేయాస్, కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, హర్దిక్ పాండ్యాల ఆటతీరుకు తలవంచక తప్పలేదు.

తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ తొలి ఏడు ఓవర్లు ఒక ఎత్తయితే ఆ తర్వాత 43 ఓవర్లు మరో ఎత్తు. వరుణ్, కుల్‌దీప్, జడేజా, అక్షర్‌ల మాస్టర్ స్ట్రోక్ కివీస్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ నలుగురూ కలిసి ఏకంగా 35 ఓవర్లు వేసి న్యూజిలాండ్‌ను కోలుకోనీయలేదు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ తమ రైట్-లెఫ్ట్ రిస్ట్ స్పిన్‌కు తోడు, స్పిన్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ బంతితో పాటు బ్యాట్‌తోనూ మ్యాజిక్ చేయడం మొత్తంగా భారత్‌కు కలిసివచ్చింది. టోర్నీలో న్యూజిలాండ్‌పైనే డబుల్ సెంచరీతో వన్డేల్లో తన మార్కు చూపిన ఓపెనర్ గిల్ మెగా ఫైనల్లోనూ అదే టీమ్‌పై మెరుగైన పెర్ఫామెన్స్‌తో ఆకట్టుకున్నాడు. ఫైనల్ మ్యాచ్‌లో పేసర్ల కాకుండా రోహిత్ చేసిన ప్రయోగం టీమిండియా విజయానికి బాటలు వేసింది.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆ సిరీస్‌లు ముగిసిన తర్వాత ఇంకా ఎందుకు కొనసాగుతున్నారనే ప్రశ్నలు తలెత్తాయి. గత టీ20 ప్రపంచ కప్‌ను సొంతం చేసుకోవడంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించిన సంగతిని మరుగునపెడుతూ.. జట్టుకు భారంగా మారారనే దాకా విమర్శలు వెల్లువెత్తాయి. ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఇక పాక్‌పై అద్భుత శతకం, ఆస్ట్రేలియాపై కీలక హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించడంలో కోహ్లీ కీలకపాత్ర పోషించాడు. ఈ టోర్నీ ముందు వరకూ వీరిద్దరూ రిటైర్‌మెంట్ ప్రకటిస్తే బాగుండని అనుకొన్న అభిమానులే.. ఇప్పుడు మున్ముందు కొనసాగాలని కోరుకుంటున్నారంటే భారత విజయాల్లో వీరి పాత్ర ఏమిటో అర్థమైపోతుంది.

ఆరంభ ఓవర్లలో వికెట్లు తీసి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే బుమ్రా లేకపోవడం లోటేనని అంతా భావించారు. కానీ, దాదాపు 400 రోజులకుపైగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న షమీ పునరాగమనం కాస్త ఆనందాన్నిచ్చినా.. బంతిని కొత్త కుర్రాళ్లు హర్షిత్ రాణా, అర్ష్‌దీప్‌సింగ్‌తోనే పంచుకోవా ల్సిన పరిస్థితి. దుబారు వేదికగా మ్యాచ్‌లు కావడంతో షమీ, హార్దిక్ పాండ్యల పేస్ బౌలింగ్ టీమిండియాను విజయతీరాలకు నడిపించింది. ఈ ట్రోఫీలో ఆడిన ఐదు మ్యాచుల్లోనూ భారత్ టాస్ ఓడింది. అయినా ట్రోఫీని గెలిచింది. ఇంత గొప్ప విజయపు విజయోత్సవ ర్యాలీలు దాడులకు దారి తీయడం అత్యంత విషాదం.

# గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

**రాజమహేంద్రవరం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను తూర్పుగోదావరి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పి డి నరసింహ కిషోర్ వెల్లడించారు. రాజమండ్రి రూరల్ మండలం కొంతమూరు గ్రామ పరిధిలోని ఎయిర్పోర్ట్ రోడ్ లో గల కొంతమూరు అండర్ బ్రిడ్జి వద్ద రంపచోడవరం వైపు నుండి అధిక మొత్తంలో గంజాయి రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారం పోలీసులకు ఉంది వచ్చిందన్నారు. అండర్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీ ప్రారంభించగా 150 కేజీల గంజాయిని ఒక కారు డిక్కీలో గుర్తించామని తెలిపారు. ఆ కారుకి పోలీస్ తనిఖీల గురించి ముందస్తు సమాచారం ఇచ్చే నిమిత్తం పైలట్ గా వ్యవహరించే ఒక ఆటో కూడా నిందితులు ఏర్పాటు చేసుకున్నారని, రెండూ ఒకదాని వెంబడి మరొకటి రంపచోడవరం వైపు నుండి ఎయిర్పోర్ట్ రోడ్డు లోకి వస్తున్నాయన్నారు. అక్కడ నుంచి జాతీయ రహదారిపైకి ఎక్కే క్రమంలో పోలీసువారిని చూచి పారిపోతున్న కారు ... ఆటోను రాజనగరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ మనోహర్ ... సిబ్బంది పట్టుకుని తనిఖీ చేశారని... 150 కేజీల గంజాయి, ఒక్కొక్క ప్యాకెట్ 2 కేజీలు చొప్పున మొత్తం 75 ప్యాకెట్లు కారు డిక్కీలో ఉన్నాయని గుర్తించారమన్నారు. సదరు గంజాయిని వ్యాపారం కొరకు ఏ ఓ బి ఏజెన్సీ నుండి తీసుకువస్తున్నట్లుగా తెలుస్తుందన్నారు. అయిదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు రూ. 7,50,000/- విలువ చేసే 150 కేజీల గంజాయిని, వాటి రవాణా కొరకు ఉపయోగిస్తున్న ఒక కారు, ఆటో, 5 మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. అరెస్టు అయిన వారిలో ప్రకాశం జిల్లా కంభం గ్రామం మండలం నయా స్ట్రీట్ కు చెందిన షేక్ ఇంతియాజ్, సింకొండ గరాయి గ్రామానికి చెందిన, షేక్ అబ్దుల్ సలీం, రంపచోడవరానికి చెందిన సంకురు బుచ్చి రెడ్డి, ముర్ల చిన్నారెడ్డి, ఉలుగుల రవికిరణ్ రెడ్డి ఉన్నారని తెలిపారు. సదరు గంజాయిని ఎవరి వద్ద కొన్నది మరియు ఎవరికి అమ్మవచ్చునన్నది తదుపరి దర్యాప్తులో తెలుసుకుని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. గంజాయిని పట్టుకున్న నార్త్ జోన్ డిఎస్పీ వై శ్రీకాంత్, రాజానగరం ఇన్స్పెక్టర్ ఎస్పీ వీరయ్య గౌడ్, ఎస్సై పి మనోహర్, వారి సిబ్బంది కానిస్టేబుల్స్ రమణ, నాగేశ్వరరావు, కరీముల్లా ఖాదర్లను ఎస్పీ అభినందించారు.

## మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకి
# పాల్పడితే కఠిన శిక్షలు
### డిజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపిఎస్.

**మంగళగిరి మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకి పాల్పడిన కేసులలో దర్యాప్తు వేగవంతం చేసి న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపిఎస్ తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే దాడులను ఉక్కుపాదంతో అణచివేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. విజయనగరం జిల్లా పరిధిలో చిన్నారులపై జరిగిన అఘాయిత్యాల (%ాఉజూఉ%) కేసుల్లో నిందితులకు 3 నెలల నుండి 6 నెలల లోపే శిక్షలు ఖరారు చేయడంలో విజయం సాదించిన విజయనగరం పోలీసులను ఈ సందర్భంగా డీజీపీ అభినందించారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారు శిక్షల నుండి తప్పించుకోలేరని అన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలను నివారించడానికి ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో "వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్" ను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు "శక్తి" యాప్ ను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ శక్తి యాప్ కు పలు అదునాతన ఫీచర్ లను జోడించడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు టోల్ ఫ్రీ నంబర్స్ 181, 112, 1098,1093 కు కాల్ చేసినా లేదా మొబైల్లో ఉన్న శక్తి యాప్ లో గల '%ాఉూ%' మీట నొక్కినా లేదా ఫోనును అటూ, ఇటూ గట్టిగా ఉపినా కంట్రోల్ రూమ్ కి సమాచారం వెళ్లి నిమిషాల వ్యవధిలోనే శక్తి టీమ్స్ సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణగా నిలుస్తాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేదింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడమే లక్ష్యంగా శక్తి టీమ్స్ పనిచేస్తాయి అని అన్నారు.

## బిజెపిలో కంబాల ఎదుగుదల చూడలేకే దుష్ప్రచారం.
- శ్రీరంగపట్నం గౌరీచౌక్ మహిళలు.



**కోరుకొండ మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలోని శ్రీరంగపట్నం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కంబాల తమ గ్రామం విచ్చేసారని, అప్పటి నుండి కంబాలపై ఒక వర్గం దుష్ప్రచారం చేయడం బాధాకరమని గౌరీచౌక్ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శ్రీరంగపట్నం గౌరీచౌక్ లోని మహిళలు, కొద్దిమంది పురుషులు పాత్రికేయులతో మాట్లాడారు. బుద్ధ వీరశివ, పొలమరశెట్టి రాజేశ్వరి తదితరులు మాట్లాడుతూ విశ్వహిందు ధర్మ పరిరక్షణ సేవా సమితి అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు రాజానగరం, జగ్గంపేట, అల్లూరి జిల్లాల నియోజకవర్గాల్లో ఆపదలో ఉన్నవారికి విరివిగా ఆర్థిక సహాయం అందిస్తూ, హిందూధర్మ పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. కంభాలకు శ్రీరంగపట్నం గ్రామంపై మమకారం ఎక్కువని, మహిళల అభ్యున్నతికి, గ్రామ అభివృద్ధికి పలుమార్లు ఆర్థికంగా చేయూతనిచ్చారన్నారు. అదేవిధంగా భారతీయ జనతాపార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తూ, పార్టీ అభివృద్ధి, హిందూధర్మ పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఈయన పార్టీకి చేస్తున్న కృషి, ఆయన ఎదుగుదలను చూడలేని వర్గం రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరికి తప్పుడు సమాచారం ఇవ్వడం బాధాకరమన్నారు. కంబాల వల్ల శ్రీరంగపట్నం గ్రామంలో ఏ నాయకులకు అవమానం జరగలేదని, కొందరు నాయకులు అవమానం భావించుకొని ఆమె దృష్టికి తీసుకెళ్ళి పూర్తిగా అవాస్తవమన్నారు. భాజపా నాయకులు పార్టీ బలోపేతానికి, హిందూధర్మ పరిరక్షణకు, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి నాలుగు అడుగులు ముందుకు వేస్తున్న కంబాలను వెనకకులాడం సరికాదని బీశెట్టి జగ్గారావు అన్నారు. తామంతా కంబాల వెనకాల నడుస్తామని, భారతీయ జనతాపార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## ఇక జిల్లాకో
# ప్రత్యేక అధికారి..

సమా వేశాలు నిర్వహించాలి. గ్రామాల్లో పర్యటించాలి. నెలకు కనీసం రెండుసార్లు గ్రామాల్లో రాత్రి బస చేయాలి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించాలి. తగు చర్యలు చేపట్టాలి. నెలవారీ పురోగతి నివేదికను జోనల్ ఇన్చార్జి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించాలి.

**జోనల్ ఇన్చార్జుల బాధ్యతలు**

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించాలి. నెలవారీ సమీక్షలు నిర్వహించాలి. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్లో పాల్గొనాలి. (ఉదా: ప్రతి నెల 1న పింఛన్ల పంపిణీ. ప్రతి 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర) నెలకోసారి గ్రామాలను సందర్శించి అక్కడ రాత్రి బస చేయాలి. పారిశ్రామికవేత్తలు, రైతులు, లబ్దిదారులు, ప్రజాప్రతి నిధులు, పన్ను చెల్లింపుదారులతో చర్చలు నిర్వహించాలి. జిల్లా కలెక్టర్లు, కీలక అధికారులకు పరిపాలనా సంబంధిత శిక్షణ అందించాలి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిని సమీక్షించాలి. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో అవాంతరాలను గుర్తించి, జాప్యానికి కారణాలను విశ్లేషించాలి. ముఖ్యమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, వ్యయాన్ని సమీక్షించాలి. జిల్లా పురోగతి, సమస్యలు, సిఫారసులను ముఖ్య కార్యదర్శికి నివేదించాలి.....

## నా జీవితంలో రాజకీయ కక్షలనేవి ఉండవు

హయాంలో జరిగింది. అందుకే భూ కబ్జాలు జరగకుండా కట్టుదిట్టమైన చట్టాన్ని తీసుకువచ్చాం. శాంతి భద్రతల విషయంలో డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ చేయిస్తున్నాం. నేరం రుజువైతే రెండు మూడు నెలల్లోనే శిక్షలు పడేలా కార్యాచరణ రూపొందించాం. సైబర్ సెక్యూరిటీ విషయంలో కట్టుదిట్టమైన చర్యలను ప్రభుత్వం చేపట్టింది. 26 జిల్లాల్లో సైబర్ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేసి భద్రత కల్పించే ప్రయత్నం చేస్తున్నాం" అని సీఎం తెలిపారు.

## జనసేన ఆవిర్భావ సభ ప్రాంగణాన్ని పరిశీలించిన శ్రీ నాదెండ్ల మనోహర్

ఉండే అతిథులతోపాటు, సాంకేతిక, మెడికల్ బృందాలను, అధికారులు, కళాకారులు, సమన్వయం చేసుకొంటూ వారికి అవసరమైన ఏర్పాట్లను చూసే బాధ్యతను పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ సంగిశెట్టి అశోక్ కు అప్పగించారు. సభ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీతో కలసి ఆయన పని చేస్తారు.

## ప్రకటనలకు [illegible] నియోగం..

అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఆ పత్రిక కొనుగోలు కోసం గత ప్రభుత్వం వాలంటీర్లకు రూ.200 చొప్పున చెల్లించిందని చెప్పారు. అక్రమంగా జరిగిన ఈ చెల్లింపులపై విచారణ చేపడతామని.. సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని మంత్రి స్పష్టం చేశారు.

### వరద బాధితులకు జగన్ విరాళం ఇవ్వలేదు: మంత్రి

మరోవైపు వరద బాధితులకు ఆర్థిక సాయంపై మండలిలో చర్చ జరిగింది. ప్రభుత్వానికి వైకాపా అధ్యక్షుడు జగన్ రూ.కోటి విరాళం ఇచ్చారని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొనగా.. మంత్రి పార్థసారథి స్పందించారు. జగన్ ప్రభుత్వానికి విరాళం ఇవ్వలేదని తెలిపారు. దీనిపై విచారణకు కమిటీ వేసేందుకు సిద్ధమని హోంమంత్రి అనిత ప్రకటించారు.

## 30 వేల మంది పైలట్లు అవసరం

పైలట్లు అవసరమని చెప్పారు. భారత్‌ను ట్రైనింగ్ హబ్‌గా కూడా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విమానయాన పరిశ్రమ కోసం మంత్రిత్వ శాఖ ఒక సమష్టి విధానంతో పనిచేస్తోందని చెప్పారు. 38 ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్‌ను తనిఖీ చేసి అధికారులు రేటింగ్ ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

# 2028 నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తాం

## మంత్రి నారాయణ




అమరావతి, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజధాని అమరావతి నిర్మాణానికయ్యే ఖర్చు రూ.64,721 కోట్లని ఏపీ పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. 2028 నాటికి రాజధాని నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో భాజపా ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ)లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం రూ.64,721.48 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఈ నిధులను వివిధ రూపాల్లో సేకరించి అమరావతి నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. వివిధ ఏజెన్సీలు, బ్యాంకుల నుంచి రుణాలు, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు పొందడం ద్వారా నిధులు సేకరించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడేళ్లలో రైతులకు అప్పగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రైతులు 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. ప్రపంచంలో టాప్-5 నగరాల్లో ఒకటిగా అమరావతి ఉండాలని రాజధానిని సీఎం డిజైన్ చేశారన్నారు.

అమరావతి నిర్మాణానికి 30వేల ఎకరాలు కావాలని ఇదే అసెంబ్లీ సాక్షిగా జగన్ చెప్పారని.. అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించి మూడు ముక్కలాట ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి భూములిచ్చిన రైతులను గత ఐదేళ్లలో నానా ఇబ్బందులు పెట్టారని ఆక్షేపించారు. శాడిజంతో ఆర్-5 జోన్ ఏర్పాటు చేశారని.. 50వేల మందికి ఒక సెంట్ భూమి ఇచ్చారన్నారు. వారికి కూడా ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాజధానికి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు కలిపి రూ.13,400 కోట్ల రుణం ఇస్తున్నాయన్నారు. కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రూ.5 వేలకోట్ల రుణం ఇస్తుందని.. హడ్కో నుంచి రూ.11వేల కోట్ల రుణం రెండు మూడు రోజుల్లో వస్తుందన్నారు. అమరావతిలో 106 ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థలు తమ కార్యాలయాలు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. సగానికి పైగా నిర్మాణం జరిగిన అధికారుల భవనాలు ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని మంత్రి వివరించారు. మిగతావి రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు.

# గీతాభవనంలో సంపూర్ణ గీతా పారాయణం




విశాఖపట్నం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పాతనగరం రాజప్ప నాయుడు వీధిలో గల శ్రీ గీతాభవనంలో శ్రీ గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో ఏకాదశి సందర్భంగా అధ్యక్షులు చావలి విశ్వేశ్వరరావు సారధ్యంలో సంపూర్ణ గీతా పారాయణం జరిగింది . శ్రీ గీతా ప్రచార సమితి మహిళా సభ్యులు సామూహికంగా 18 అధ్యాయాలతో కూడిన భగవద్గీతలో గల అన్ని శ్లోకాలను ముక్తకంఠంతో పారాయణ చేశారు.

అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్ధ ప్రసాదములు , మహా ప్రసాదము అందజేశారు . ఇటీవల ఇస్కాన్ నిర్వహించిన శ్రీ గీతాజయంతి ఉత్సవంలో శ్రీ గీతా ప్రచార సమితి సభ్యులు పాల్గొని సామూహికంగా సంపూర్ణ గీతను పారాయణం చేసినందుకుగాను ఇస్కాన్ తరపున సంస్థ పిఆర్ఓ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ గీతాజయంతి ఉత్సవంలో పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు . కార్యక్రమంలో గీతా ప్రచార సమితి ప్రతినిధులు సిహెచ్ విశ్వేశ్వరరావు , ఎం వనజాదేవి , జివిఆర్ ప్రసాద్ , జి లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు .

# విద్యుత్ దీపాలంకరణలో దగదగలాడుతున్న వడ్డాది



బుచ్చయ్యపేట, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వడ్డాది వెంకన్న 152 వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామమంతా విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుండి వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న గిరిజాంబ గిరి వరకు ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాల తోరణాలు కాంతులీనుతున్నాయి. విద్యుత్ సెట్టింగులు,తోరణాలు భక్తులను విశేషంగా ఆరిస్తున్నాయి. గిరిజాంబగిరి వద్ద దేవాదాయ శాఖ,జంక్షన్ లో వర్తక సంఘం విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు.

# మాడుగుల డిజిటల్ మీడియాకి పోలీస్ సత్కారం




విమాడుగల, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాడుగుల డిజిటల్ మీడియా క్రియేటర్స్ కు రాష్ట్ర హోంశాఖ గౌరవ పురస్కారం దక్కింది. మాడుగుల డిజిటల్ క్రియేటర్స్ బొబ్బోది శంకర్, తుంపాల రమేష్, పోతల శ్రీనివాస నాయుడులు జిల్లా పోలీసువారి సహకారంతో గంజాయి నిర్మూలన, బాల్యవివాహాలు అరికట్టడంపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వీడియోలను గుర్తిస్తూ సోమవారం నక్కపల్లి లో జరిగిన పోలీస్ సమావేశంలో హోం శాఖామంత్రి వంగపూడి అనిత చేతుల మీదుగా ఈ ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వీరు ప్రశంసా పత్రాలను అందుకోవడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.

# వైభవోపేతంగా శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం పునః ప్రతిష్టా మహోత్సవం

**శాస్త్రోక్తముగా యంత్ర విగ్రహ పూర్ణకలశ ప్రతిష్ఠ, విగ్రహ ఆవిష్కరణ, ప్రాణ ప్రతిష్ఠ , మహా పూర్ణాహుతి**





విశాఖపట్నం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విశాఖ నగరంలోని మధురవాడ ,మిధిలాపురి ఉడా కోలని ,బింద్రానగర్,షిప్ యార్డు లే అవుట్ లో అత్యంత వైభవోపేతంగా శ్రీశ్రీశ్రీ విజయగణపతి, ఏకశిల నాగాభరణ, శివలింగము,శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ సంతాన నాగేంద్ర స్వామి, శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునః ప్రతిష్టా మహోత్సవాన్ని నిర్వహించారు..

ఈనెల 7వ తేదీ నుండి శ్రీ నూకంబిక అమ్మవారి ఆలయ సమూహ వన ప్రతిష్ట మహోత్సవములను బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామ శర్మ,బ్రహ్మశ్రీ ఇప్పిలి సాయికిరణ్ శర్మ,బ్రహ్మశ్రీ అర్జింగి జగదీశ్వర్ ల పర్యవేక్షణ, నిర్వహణలో బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామ శర్మగారి ఆధ్వర్యములో 12 మంది వేద పండితులతో పునః ప్రతిష్టా మహోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించిన సంగతి తెలిసిందే.. అందులో భాగంగా .సోమవారం సుప్రభాతసేవ, వేదపారాయణ, దీక్షాదారులచే యంత్ర విగ్రహ పూర్ణకలశ ప్రతిష్ఠ, విగ్రహ ఆవిష్కరణ, ప్రాణ ప్రతిష్ఠ , మహా పూర్ణాహుతి, అమ్మవారి దర్శనం, అవబృత స్నానం,వేద ఆశీర్వచనం, పండిత సత్కారం జరిపారు . మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో మహా అన్నసమారాధ జరిపారు. సాయంత్రం 5 లకు తిరుపతి వాస్తవ్యులు డాక్టర్ మల్లంపల్లి భద్రకాళీ చే "దేవి వైభవము" ప్రవచన కార్యక్రమము తదుపరి సాంస్కృత కార్యక్రమము పిల్లలచే నిర్వహించారు.. ఈ మహోత్సవ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తుల పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించినట్టు శ్రీ నూకంబిక ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపారు.








తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
బుధవారం 12 మార్చి 2025

# నేడు డయల్ యువర్ డియం



**అమలాపురం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అమలాపురం ఆర్.టి.సి. డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై 12వ తేదీ బుధవారం డయల్ యువర్ డి.యం. కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 9581932678 సెల్ నంబరుకి ఫోన్ చేసి చెప్పాలని ఆయన కోరారు.

# విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

**కాట్రేనికోన మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, శ్రీవాణి కాన్వెంట్ హై స్కూల్ ఉపాధ్యాయుడు ప్రసాద్ తండ్రి గారు కె.టి.సుబ్రమణ్యం ఆదివారం రాత్రి మృతి చెందారు. వీరికి ఒక కుమారుడు,ఒక కుమార్తె గలరు. సొంత ఊరు లోనే పదవీ బాధ్యతలు స్వీకరించి ,సొంత గ్రామంలోనే లోనే అప్పర్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ గా పదవీ విరమణ చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు.ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సౌమ్యుడు ఆయన లేని లోటు తీరనిదని పలువురు ప్రముఖులు, గ్రామస్తులు, శిష్యులు, సంతాపం వ్యక్తం చేశారు.

# విదేశాలకు వెళ్లే వాళ్లకు హెల్ప్ డెస్క్ ఎంతో ఉపయోగపడుతుంది





**అమలాపురం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
స్థానికంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించక విదేశాలకు వలస వెళ్లి తమ కుటుంబాలను పోషించుకోదలచిన వారికి అన్ని విధా %శ్రీ%ల సౌకర్యవంతమైన చట్టబద్ధంగా మార్గ నిర్దేశం చేసేందుకు స్థానిక కలెక్టరేట్లో విదేశీ వ్యవహారాల హెల్ప్ డెస్క్ (కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు విదేశీ వ్యవహారాల హెల్ప్ డెస్క్ ను ఆయన జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి, డిఆర్ఓ బిఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవోలు కె మాధవి, పి శ్రీకర్, డి అఖిల లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి విదేశాలకు వలస వెళ్లి జీవనోపాదులు పొందాలనుకునేవారికి అన్ని విధాల చట్టబద్ధంగా విదేశాలలో ఉన్న అవకాశాలు పాస్ పోర్టు వీసాలు పొందేందుకు గల మార్గాలను సూచించడంతోపాటు అన్ని విధాల గైడెన్స్ ఇస్తూ ఎటువంటి మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఈ కేంద్రం ఒక వరంగా నిలుస్తుందన్నారు. విదేశాలకు వెల్లదలచిన వారు విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చిన వారు మరల తిరిగి వెళ్ళేందుకు ఈ కేంద్రం తగిన చట్టబద్ధత కలిగిన సహకారాన్ని సలహాలను అందిస్తుందన్నారు. గతంలో ఏజెంట్లు సంస్థలు తరపున విదేశాలకు వెళ్లి ముందుగా సూచించిన ఉద్యోగం కాకుండా వెట్టి చాకిరీ పనులకు నియమించడం జరిగేదని అదే విధంగా సందర్శన వేషాలతో ఏజెంట్లు పంపుతూ పలు మోసాలకు పాల్పడే వారిని వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఈ ఈ కేంద్రాన్ని స్థానికంగా ఆరుగురు సిబ్బందితో పూర్తి సమాచారాన్ని సపోర్ట్ ను అందించే విధంగా నెలకొల్పడం జరిగిందన్నారు. ఇకపై విదేశాలకు వెళ్లదలచినవారు తప్పనిసరిగా ఈ కేంద్రాన్ని ఆశ్రయించి చట్టబద్ధంగా విదేశాలు వెళ్లేందుకు ఉన్న అవకాశాలను ఉద్యోగాలను పొందేందుకు మార్గనిర్దేశం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ నోడల్ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి, సమన్వయకర్త గోళ్ళ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# టిప్పర్ లారీ ఢీకొని వివాహిత దుర్మరణం



**రావులపాలెం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రావులపాలెం మండలం ఊబలంక వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామానికి చెందిన వందే విజయకుమారి (40), రమేష్ బాబు దంపతులు అమలాపురంలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు వెళ్ళారు. తిరిగి సాయంత్రం మోటార్ సైకిల్ పై ఇంటికి వస్తుండగా రావులపాలెం – బొబ్బర్లంక ప్రధాన రహదారిపై ఊబలంక వినాయకుని ఆలయం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న టిప్పర్ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు ఇద్దరూ రోడ్డుపై పడిపోగా విజయకుమారి పైనుంచి లారీ చక్రాలు వెళ్ళడంతో తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కళ్ళ ముందే భార్య మృతి చెందడంతో రమేష్ బాబు కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ మేరకు ఎస్సై నాయుడు రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రీ సర్వే అంశాలపై సమీక్షా సమావేశం

# నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్




**అమలాపురం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ప్రజా సంతృప్తే కొలమానంగా భూ పరిపాలన రీ సర్వే అంశాలలో ఉద్యోగులు ప్రజలకు పారదర్శకంగా నిష్పక్షపాతంగా అంకిత భావంతో సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అమరావతి నుండి రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి 26 జిల్లాల కలెక్టర్లు జిల్లా జాయింట్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించి సర్వే సెటిల్మెంట్లు భూమి రికార్డుల విభాగం పైలట్ గ్రామాలలో రీ సర్వే పురోగతి అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారం కొరకు సకాలంలో చర్యలు తీసుకుంటూ పురోగతిని ఆన్లైన్ లో డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. పౌర సేవలలో నాణ్యతను పెంచడంతోపాటు సంతృప్తి చెందేలా ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. సరిహద్దు రాళ్లపై పేర్లను చెరిపేసే కార్యక్రమాలను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. పాస్ పుస్తకాలు జారీ అదనపు ఫీజులు వంటి అంశాలలో అవినీతికి తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు రీ సర్వే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ స్థితిగతులను మెరుగుపరిచేందుకు తరచుగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని ఆర్డీవోలకు సూచించారు. పైలెట్ గ్రామాలలో గ్రౌండ్ పనులు పూర్తయిన వెంటనే నోటీసులు జారీ చేస్తూ తదుపరి 2వ దశ రీసర్వే గ్రామాల జాబితా ప్రకారం సర్వే కొనసాగించాలన్నారు. పైలెట్ గ్రామాలలో పురోగతిని పున: పరిశీలన చేసుకోవాలన్నారు. రీ సర్వే అన్ని దశలలో ఆశించిన పురోగతిని సాధిస్తూ జిల్లాను ముందంజలో నిలపాలన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టులో 17 గ్రామాలను ఎంపిక చేయగా 11 గ్రా మాలలో గ్రౌండ్ ట్రూథింగ్ పని పూర్తయిందని మిగిలిన పని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక్కొక్క టీము రోజుకు 20 ఎకరాలు విస్తీర్ణానికి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వేయర్లకు రీసర్వే పని తప్ప వేరే పనులు కేటాయించరాదని ఆయన సూచించారు. గ్రామాలు బ్లాకులను విభజిస్తూ రెవెన్యూ రికార్డులను స్వచ్ఛీకరణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. భూ యజమాన్యాల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల తీర్మానాలను పరిగణనలో తీసుకుంటూ సర్వేను అత్యంత ఖచ్చితత్వంతో భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు తావులేని విధంగా నిర్వహించాలని ఆదేశించారు. తప్పుల మీద తప్పులు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రక్రియను నాణ్యతతో చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ సర్వే అంశాల పట్ల జవాబు దారీతనంతో ఉద్యోగులు మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి, ఆర్డీవోలు డి అఖిల, పి శ్రీ కర్, కె మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 7 తారీఖు నుండి 13వ తారీకు వరకు

# వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి తీర్థ మహోత్సవాలు

**అమలాపురం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి**
ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో వేం చేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ కళ్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు మాదిరిగా అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించి విజయవంతం గావించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లా అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తీర్థ కళ్యాణ మహోత్సవాలు సన్నద్ధతపై దేవాదాయ, పోలీసు రెవెన్యూ ,ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రియల్ 7 వ తేదీన సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం 8 వ తేదీన మంగళవారం స్వామి వారి తీర్థం రథోత్సవం మరియు కళ్యాణం కార్యక్రమాలను, 9వ తేదీ బుధవారం స్వామి వారి పొన్న వాహన సేవ, 11వ తేదీ శుక్రవారం గోదావరి నదిలో తెప్పోత్సవం, 12వ తేదీ శనివారం మహా పూర్ణాహుతి చక్రస్నానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ భక్తుల సౌకర్యార్థం పోలీసు వారి పరివేక్షణలో పటిష్టమైన క్యూలైన్లను తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా నిర్వహించాలన్నారు. వికలాంగులకు వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక దర్శన ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేస్తూ అందరికీ వినిపించే విధంగా సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు భక్తుల సౌకర్యార్థం నడపాలని వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఏపీ ట్రాన్స్కో వారు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ వారు తగినన్ని తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతోపాటు త్రాగునీటిని సమృద్ధిగా భక్తులకు పంపిణీ చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్ అండ్ బి వారు క్యూ లైన్లు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తగు చర్యలు చేపట్టాలన్నారు. తెప్పోత్సవానికి గోదావరి నదిలో బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి, దేవస్థాన కార్యనిర్వహణాధికారి చక్రధరరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఆర్డీవోలు పి శ్రీకర్, కె మాధవి డి.అఖిల, తాహసిల్దార్ రాజేశ్వరరావు వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మృతురాలి కుటుంబానికి న్యాయం కోరుతూ ఆందోళన



**రావులపాలెం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలంటూ మంగళవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మృతురాలి బంధువులు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామానికి చెందిన వందే విజయకుమారి (45) సోమవారం సాయంత్రం తన భర్త రమేష్ బాబు తో కలిసి మోటార్ సైకిల్ పై రావులపాలెం నుంచి ఇంటికి వెళు తుండగా ఊబలంక వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో మంగళవారం రావులపాలెం పోలీస్ స్టేషన్ ఎదురుగా 216 ఏ జాతీయ రహదారిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విజయకుమారి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. టౌన్ సిఐ శేఖర్ బాబు వారితో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

# నిరుపేద సహాయనిది సంస్థ సేవలు ప్రశంసనీయం

## రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్

**మలికిపురం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
నిరుపేద సహాయనిధి సంస్థ పేరుతో అనేక పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ ఆపదలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందిస్తున్న సంస్థ సేవలను రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రత్యేకంగా ప్రశంసించారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది ప్రకాశపురం గ్రామానికి చెందిన చొప్పల సురేంద్ర గత 15 సంవత్సరాల క్రితం కుటుంబ పోషణ నిమిత్తం కరెంట్ పనికి వెళ్లి స్తంభం పై నుండి పడిపోయారు.ప్రమాదంలో తన వెన్నుముక విరిగి పూర్తిగా మంచానికి పరిమితం అయ్యారు.వీరిది చాలా పేద కుటుంబం తన తల్లి ఉపాధి హామీ పనికి వెళ్లి తన కుటుంబాన్ని పోషిస్తుంది.వాళ్ల నాన్న ఆరోగ్యం కూడా సరిగా ఉండదు సురేంద్ర ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేదు పెద్ద పెద్ద పుండ్లు పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు.వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి వలన మెరుగైన వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉన్నారు ఈ విషయం తెలుసుకున్న నిరుపేద సహాయ నిధి గ్రూపు సభ్యులు నుండి స్పందించి 11 వేలు సమకూర్చి మాజీ శాసనసభ్యులు రాపాక వరప్రసాద రావు,కె.యస్.యన్ రాజు చేతులమీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో కొల్లాబత్తుల అశోక్ కుమార్,మోకా దివాకర్ కుసుమ చింటూ స్పందించి సహాయం చేసిన వారు కొల్లాబత్తుల రాజమణి (ఇజ్రాయిల్ అంతర్వేది) కొల్లాబత్తుల మధు కుమార్ ( ఇజ్రాయిల్ అడ్డాలపాలెం కోళ్ల మధురేష్ (కువైట్ మోరిపోడు)కాట్రు శేఖర్ ( ఇజ్రాయిల్ అప్పనరాములంక) తాడి శ్యామసుందర్ (చిట్టి) కువైట్ శంకరగుప్తం ఓగూరి విజయకుమార్(పండు) (ఇజ్రాయిల్ చింతలమోరి) మలికిపురం మండలం అడవి పాలెం గ్రామానికి చెందిన తాడి శివాజీ అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఎన్నారై నిరుపేద సహాయనిది గ్రూపు నుండి (పదివేల రూపాయలు) పంపించడం జరిగింది.ఆర్థిక సహాయాన్ని సమకూర్చిన గెడ్డం సురేష్ (దుబాయ్ గుడిమెల్లంక) కొల్లాబత్తుల రాజ్ కుమార్( కువైట్ చింతలమోరి)చెవ్వాకుల మోహన్ (ఇజ్రాయిల్ చింతలమోరి)కొల్లాబత్తుల ఝాన్సీ( దుబాయ్..గొంది)గంటా సుధాకర్ (ఇజ్రాయిల్ చింతలమోరి)ఈ ఆర్థిక సహాయాన్ని మాజీ శాసనసభ్యులు రాపాక వరప్రసాద రావు,కె.యస్.యన్ రాజు చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో కొల్లాబత్తుల అశోక్ కుమార్,మోకా దివాకర్,కుసుమ చింటూ,కోళ్ల వేణు,పాల్గొన్నారు.





# నయనానందకరంగా శ్రీ లక్ష్మీనరసన్న దివ్య కళ్యాణ మహోత్సవం

## - కళ్యాణోత్సవంలో పాల్గొన్న తాజా,మాజీ శాసనసభ్యులు.

## - గోవింద నామస్మరణతో మార్మోగిన ప్రాంగణం.



కోరుకొండ, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య కళ్యాణమహోత్సవాలు ఆలయ వంశపారం పర్య ధర్మకర్త ఎస్పి రంగరాజబట్ట, అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు ఆధ్వర్యంలో పెద్దింటి, పెదపాటి, పెరవలి వేద పండితుల పర్యవేక్షణలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, శ్రీదేవి భూదేవిసమేత అనంత పద్మనాభస్వామి వార్ల దివ్య కళ్యాణమహోత్సవం వేదమంత్రోచరణలు, మంగళ వాయిద్యాలు, అశేష భక్తుల గోవింద నామస్మరణలతో నాయినానందకరంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి 9 గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీదేవి భూదేవిసమేత అనంత పద్మనాభస్వామి దివ్య కళ్యాణంమహోత్సవం లోక కళ్యాణార్థం శ్రీ వైఖానస ఆగమ శాస్త్ర యుక్తంగా వేద పండితులు పవన్ కుమార్ ఆచార్యులు, అన్నవరం దేవస్థానం వేదపండితులు అత్యంత ఘనంగా నిర్వహించారు. పెద్దింటి చంటిబాబు దంపతులు, పెద్దింటి రంగాచార్యుల దంపతులు పీటల మీద ఆసీనులై, వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం వారి చేతుల మీద వైభవోపేతంగా నిర్వహించారు. సుమారు 200 మంది దంపతులు స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, కనులారా తిలకించి భక్తిపారవ్శంతో గోవింద నామస్మరణలతో తనువు పులకించే విధంగా తన్మయత్వం చెందారనడంలో అతిశయోక్తి లేదు. కళ్యాణ కర్త పవన్ కుమార్ ఆచార్యులు వ్యాఖ్యానం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. స్వామి అమ్మవార్లకు తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నవరం ఈవో సుబ్బారావు దంపతులు, గ్రామపంచాయతీ, తుమ్మిడి బ్రదర్స్, శాసనసభ్యులు బత్తుల దంపతులు, పలువురు భక్తులు పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కళ్యాణం అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, స్వామివారి ముత్యాల తలంబ్రాలు, తీర్ధ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి కుటుంబం, మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా, అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు దంపతులు, వేద పండితులు గిరిధర్, సంతోష్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# గంజాయి తరలిస్తున్న 5గురు అరెస్టు

## కారు, ఆటో, 150 కేజీల గంజాయి స్వాధీనం




రాజమహేంద్రవరం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏజెన్సీ ప్రాంతంలో నుండి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసి, 150 గంజాయి, గంజాయిని తరలించేందుకు ఉపయోగించిన కారు, ఆటోలను తూర్పుగోదావరి జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం 4 గంటలకు తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి రూరల్ మండలం, కొంతమూరు గ్రామ పరిధిలోని ఎయిర్పోర్ట్ రోడ్‌లో గల కొంతమూరు అండర్ బ్రిడ్జి వద్ద రంపచోడవరం వైపు నుండి అధిక మొత్తంలో గంజాయి రవాణా చేయబడుతుందన్న పక్కా సమాచారంతో కొంతమూరు అండర్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీ చేయుచుండగా 150 కేజీల గంజాయిని ఒక కారు డిక్కీలో పెట్టుకుని ఆ కారుకి పోలీస్ తనిఖీల గురించి ముందస్తు సమాచారం ఇచ్చే నిమిత్తం పైలట్‌గా వ్యవహరించే ఒక ఆటో రెండూ ఒకదాని వెంబడి మరొకటి రంపచోడవరం వైపు నుండి ఎయిర్పోర్ట్ రోడ్డు గుండా వస్తూ జాతీయ రహదారి 16పైకి ఎక్కే క్రమంలో పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో రాజనగరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ మనోహర్, సిబ్బంది ఆ వాహనాలను వెంబడిరచి పట్టుకుని తనిఖీ చేయగా, ఈ తనిఖీలో 150 కేజీల గంజాయి, ఒక్కొక్క ప్యాకెట్ 2 కేజీలు చొప్పున మొత్తం 75 ప్యాకెట్లు కారు డిక్కీలో బయటపడ్డాయి. సదరు గంజాయిని ఆంధ్రా ఓరిస్సా బోర్డర్ ఏజెన్సీ నుండి తీసుకువస్తున్నట్లుగా నిర్ధారించారు. ఈ గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముద్దాయిలు షేక్ ఇంతియాజ్, ప్రకాశంజిల్లా, నయాగ్రీర్ కంభం గ్రామం, షేక్ అబ్దుల్ సలీం, ప్రకాశం జిల్లా సింగరాయికొండ గ్రామం, సంకురు బుచ్చి రెడ్డి, అల్లూరి జిల్లా రంపచోడవరం, ముర్ల చిన్నారెడ్డి, అల్లూరి జిల్లా రంపచోడవరం గ్రామం, ఉలుగుల రవికిరణ్, బూసి గూడెం గ్రామము, రంపచోడవరం మండలం, అల్లూరి జిల్లాలను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ.7,50,000 విలువ చేసే 150 కేజీల గంజాయిని, వాటి రవాణా కొరకు ఉపయోగిస్తున్న ఎపి 39ఎ 3333 నంబర్ గల సిఫ్ట్ డిజ్కైర్ కారు, ఎపి 39టిహెచ్ 8737 నంబర్ గల ఆటో, 5 మొబ్కెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు గంజాయిని ఎవరి వద్ద కొన్నది, ఎవరికి అమ్మవచ్చునన్నది తదుపరి దర్యాప్తులో తెలుసుకుని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ వెల్లడించారు. ఈ అరెస్టులకు సంబంధించిన వివరాలు మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడిరచారు. నార్త్ జోన్ డిఎస్పీ వై శ్రీకాంత్, రాజానగరం ఇన్స్కెక్టర్ ఎస్పీ వీరయ్య గౌడ్, ఎస్సై పి మనోహర్, వారి సిబ్బంది కానిస్టేబుల్స్ రమణ, నాగేశ్వరరావు, కరీముల్లా ఖాదర్‌లను అభినందించారు.

# మార్నింగ్ కాఫీ క్లబ్ లో అందరూ భాగస్వాములే

## ఘనంగా మార్నింగ్ కాఫీ క్లబ్ 4వ వార్షికోత్సవ వేడుకలు



భీమవరం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ చేస్తున్న ప్రతి కార్యక్రమంలో అందరూ భాగస్వాములేనని దేవాదాయ ధర్మాదాయ శాఖ ధార్మిక పరిషత్ మాజీ సభ్యులు మంతెన రామ్ కుమార్ రాజు, న్యాయవాది తాడిమళ్ళ గిరి అన్నారు. మంగళవారం భీమవరం తాడిమళ్ళ కాంప్లెక్స్ లో మార్నింగ్ కాఫీ క్లబ్ 4వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ 50 మంది స్నేహితులతో క్లబ్ ఏర్పాటు చేసి తోటివారికి ఆదర్శంగా నిలవడం గొప్ప విశేషమని అన్నారు. వెస్ట్ బెర్రీ స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, వబిలిశెట్టి రామకృష్ణ, రాయప్రోలు భగవాన్, డిఎన్నార్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ బోసురాజు మాట్లాడుతూ మార్నింగ్ కాఫీ క్లబ్ చేస్తున్న సేవలు అద్వితీయమని, 4 ఏళ్లుగా క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కోట్ల నాని, కనగర్ల విజయ రామకృష్ణ, మానేపల్లి వెంకన్నబాబు, కారుమూరి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గత 4 ఏళ్లుగా మా క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు, విశిష్ట సేవాతత్పరులకు సత్కారాలు, విశేష దినోత్సవాలను నిర్వహిస్తున్నామని, మార్నింగ్ కాఫీ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ఆదరిస్తున్నారని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అతిథులను సత్కరించారు. పున్నాని కన్నయ్య, భామ కృష్ణమూర్తి, గుండు సుమూర్తి, చవ్వ శ్రీనివాస సుబ్బారావు, కంచర్ల భాస్కరరావు గుప్తా సభ్యులు, వాకర్స్, మిత్రలు పాల్గొన్నారు.

# భీమవరం లయన్స్ క్లబ్ కు బెస్ట్ సర్వీస్ అవార్డులు




భీమవరం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

55 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన భీమవరం లయన్స్ క్లబ్ కు బెస్ట్ సర్వీస్ యాక్టివిటీస్ అవార్డులు వచ్చాయని క్లబ్ కో ఆర్డినేటర్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, అధ్యక్ష, కార్యదర్శులు పి మూర్తిరాజు, గోపిశెట్టి మురళి కృష్ణారావు తెలిపారు. ఇటీవల ఆకివీడులో నిర్వహించిన లయన్స్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో భీమవరం లయన్స్ క్లబ్ 2024 – 25లో చేసిన సేవా కార్యక్రమాలకు అవార్డు వచ్చాయని తెలిపారు. బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రెటరీ, బెస్ట్ ట్రెజరర్, బెస్ట్ సర్వీస్ యాక్టివిటీస్ అవార్డులు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ సిహెచ్ కృష్ణంరాజు, బొండాడ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# చేతివృతుల వారికి చేయూత .. ఉండి లయన్స్ క్లబ్

భీమవరం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




సమాజంలో చేతివృత్తులతో జీవనోపాధి పొందుతున్న వారిని ఆదుకోవటానికి చిరుప్రయత్నం ఉండి లయన్స్ క్లబ్ చేసినట్టు క్లబ్ వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శులు డా గాదిరాజు రంగరాజు, ముదునూరి శివరామరాజు అన్నారు. ఉండిలో మంగళవారం శివరామరాజు స్వగృహంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రీజియన్ ఛైర్మెన్ గొంట్ల కృష్ణమూర్తి సహకారంతో గ్రైండర్, గొడుగులు, వీల్ చైర్, ట్రై సైకిల్ లబ్ధిదారులకు అందించామని అన్నారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుదద్రాజు నరసరాజు, డిసి కన్నెగంటి రూత్ కళ, పాలతీర్థపు నరసింగ్ రావు, కాగిత మహంకాళి, గొట్టుముక్కల రాము, బొండాడ కేశవరావు, భూపతి హరనాధ్ రాజు లబ్ధదారులు పాల్గొన్నారు. అదే విధంగా ఉండి లయన్స్ క్లబ్ కు రీజీయన్ స్థాయిలో అవార్డులు దక్కాయని తెలిపారు. బెస్ట్ ట్రెజరర్ గా పాలతీర్థపు నరసింగ్ రావు, బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు క్లబ్ అధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి, అప్రిచే సియన్ అవార్డు క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుదద్రాజు నరసరాజు, సెకండ్ బెస్ట్ బ్యానర్ ప్రజంటేషన్ అవార్డు క్లబ్ కు వచ్చాయన్నారు.

# బీసీలకు రెండు ఎమ్మెల్సీలు ఇవ్వడం గర్వకారణం

## అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



: బీసీల సంక్షేమానికి, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రెండు ఎమ్మెల్సీలు కేటాయించడం ద్వారా మరోసారి నిరూపితమైందని దీనికి బీసీగా గర్వపడుతున్నానని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో కూడా బీసీలకు రూ.47,456 కోట్లు కేటాయించి బీసీలపై ఉన్న అభిమానం, చిత్తశుద్ధి చాటుకున్నారని కొనియాడారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో బీసీలకు బడ్జెట్లో కేటాయించిన నిధులు కూడా వేరే వాటికి వాడుకున్నారని గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి బీసీ ద్రోహి అని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల్లో బీసీలకు అన్న నందమూరి తారక రామారావు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తే జగన్ ఆ రిజర్వేషన్లను పది శాతం తగ్గించడం వల్ల బీసీలు రాజకీయంగా ఎన్నో పదవులు కోల్పోయారని విమర్శించారు. గీత కార్మికులకు నీరా పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం 60 ఎకరాలు కేటాయిస్తే జగన్ దానిని పక్కన పడేశారని మండిపడ్డారు. ఇప్పుడు గీత కార్మికులను ఆదుకునేందుకు నీరా పరిశ్రమ ఏర్పాటుకు తిరిగి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిజిల్లా కేంద్రాల్లో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. బీసీ వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించేందుకు ఆ శాఖ మంత్రి తన నియోజకవర్గానికి రూ.5 కోట్లు కేటాయించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల బీసీ వసతి గృహాల్లో కనీసం మరుగుదొడ్లు లేకుండా పోయాయని, తమ జిల్లాలో ఆనాడు వైసీపీకి చెందిన బీసీ సంక్షేమ మంత్రి ఉండేవారని, ఎంపీ కూడా బీసీ వర్గానికి చెందిన వారేనని కాని వారు ఏనాడూ బీసీ వసతి గృహాల దుస్థితి గురించి పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే తాను మూడు నెలల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని సభ దృష్టికి తీసుకు వెళ్లారు. ఇప్పుడు బీసీ వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించేందుకు మంత్రి రూ.5 కోట్లు కేటాయించాలని కోరుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని బీసీ వసతి గృహాల పరిస్థితి ఇలాగే ఉందని ఎమ్మెల్యే సుధీర్ చెప్పినదాన్ని బట్టి అర్థమవుతోందని అన్నారు. ఆదరణ పథకంలో డీడీలు కట్టిన వారికి ఉపకరణాలు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పక్కన పడేసిందని కనీసం ఇప్పుడైనా వారి డీడీలను కూటమి ప్రభుత్వం వెనక్కి ఇవ్వాలని ఆయన కోరారు. బీసీలకు ఆత్మగౌరవం ఉంటుందని గత వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్లను బూత్ బంగ్లాలో ఏర్పాటు చేసిందని ఇప్పుడు కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ల కార్యాలయాలకు సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# మావుళ్ళమ్మను దర్శించుకున్న జూ ఎన్టీఆర్ తల్లి షాలిని



భీమవరం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


జూ ఎన్టీఆర్ తల్లి షాలిని భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ వారికీ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు.

# ఈనెల 23న నిర్వహించే ఉల్లాస్ పరీక్షలకు ఏర్పాట్లు.

## జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

ఏలూరు, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)





జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదైన నిరక్షరాస్యులైన వయోజనులకు ఈనెల 23వ తేదీన నిర్వహించే పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉల్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వయోజన విద్యా, విద్యాశాఖ, తదితర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాస్యత శిక్షణ పూర్తిచేసిన 7,321 మంది ఈ పరీక్షలు వ్రాయనున్నారని అందుకోసం 732 పాఠశాలలు గుర్తించి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ వారు ఈనెల 23వ తేదీ ఆదివారం అంగన్వాడీ సెంటర్ లో గానీ, స్థానిక పాఠశాలల్లో గానీ ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని ఈ మధ్యలో ఏ 3 గంటలైన అభ్యర్ధులు పరీక్షలు వ్రాయవచ్చున్నారు. మండల పరిధిలో మండల విద్యా శాఖాధికారి %-% 2, సెర్ప్ ఎపిఎం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఈ పరీక్షలను సమర్ధవంతముగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, ఐసిడిఎస్ పిడి పి. శారద, డిఇఓ వెంకటలక్ష్మమ్మ, వయోజన విద్యా శాఖ డిడి ప్రభాకరరావు, ఉల్లాస్ నోడల్ అధికారి, ఆర్. విజయ కుమార్ పాల్గొన్నారు.

# 12 న ఫీజు పోరు ను విజయవంతం చేయండి:

## ముద్రగడ గిరిబాబు.



శంఖవరం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర వైఎస్సార్సీపి పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఈనెల 12 న నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఈవేళ న్యూస్ తో ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, విద్యార్థుల ఫీజు బకాయిలు, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తరపున వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం కాకినాడలో ఫీజు పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. యువత పోరుతో కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దామని, అన్ని వర్గాలను మోసగించేలా చంద్రబాబు పాలన సాగుతోందని, రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై విసుగు చెందారని ముద్రగడ గిరిబాబు అన్నారు.

# లిటిల్ చాంప్స్ రాష్ట్రస్థాయి

## పోటీల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ

భీమవరం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఇటీవల లిటిల్ చాంప్స్ హైదారాబాద్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలుగు ఒలింపియాడ్ లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. స్టేట్ 1, 6 ర్యాంక్ కు సాధించారని, కే రోషిత శ్రీ సంజన ( మొదటి ర్యాంక్), జే సాయి సిద్దీక్ష (6వ ర్యాంక్ ) లు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం స్కూల్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో స్కూల్ ప్రిన్సిపాల్ టీ శ్రీనివాస్, బి యుగసుధ, కే సత్యనారాయణ, దుర్గాంబ, ఉపాధ్యాయులు అభినందించారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 90 వినతులు

## నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



విశాఖపట్నం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 90 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో జివిఎంసి అదనపు కమీషనరు డి.వి.రమణమూర్తి తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు.**

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 90 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 03, 2వ జోన్ కు 14, 3వ జోన్ కు 21, 4వ జోన్ కు 6, 5వ జోన్ కు 11, 6వ జోనుకు 17, 8వ జోన్ కు 10, 9వ జోన్ కు 8, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 8 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్, అకౌంట్సు విభాగమునకు 01, రెవెన్యూ విభాగమునకు 17, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 50, ఇంజినీరింగు విభాగమునకు 11, మొక్కల విభాగమునకు 02, యు.సి.డి విభాగానికి 03 కలిపి మొత్తంగా 90 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివ ప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి. నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, డి.సి.ఆర్. ఎస్.శ్రీనివాస్, డిడిహెచ్ ఎం.దామోదర్ రావు, పర్యవేక్షక ఇంజనీర్లు గోవిందరావు, సత్యనారాయణ రాజు, రాజేంద్ర కృష్ణ, సి.పి. మీనా కుమారి, డి.సి.పి. హరిదాసు, కార్య నిర్వాహక ఇంజనీర్ చిరంజీవి, డి.పి.ఒ.లు ఎం.వి.డి. ఫణిరామ్, ఎల్.సురేష్, సి.వి.ఒ. డాక్టర్ ఎన్.కిశోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఆర్.ఎఫ్.ఒ. హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా వడ్డాది వెంకన్న కళ్యాణం

బుచ్చయ్యచౌదరి మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**వడ్డాది వెంకటేశ్వర స్వామి 152వ వార్షిక కళ్యాణ మహోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది.ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు,ఈఓ టిఎన్ఎస్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా దొండా శ్రీరామ్ చే కళ్యాణ వేడుకను జరిపించారు.**



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు తిరువీదోత్సవం నిర్వహించిన అనంతరం గిరిజాంబ గిరిపై కళ్యాణ వేడుకను నిర్వహించారు.స్వామి కల్యాణాన్ని కనులారా తిలకిం చేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో గిరిజాంబగిరి మారు మ్రోగింది. మంగళవారం తెల్లవారు3 గంటల వరకు కళ్యాణ వేడుక కొనసాగింది.రెండో రోజు మంగళవారం కూడా భక్తులు శ్రీవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి కళ్యాణం

వి.మాడుగల మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాడుగుల మండలంలోని ఎం కోడూరు గ్రామంలో సోమవారం రాత్రి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి కళ్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి 35వ వార్షికోత్సవ కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ కళ్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణం సందర్భంగా ఉదయం పొందూరు ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీనివాసానంద స్వామీజీ ప్రవచనాలను నిర్వహించారు మధ్యాహ్నం నుండి ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలను శనివారం వరకు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం


చోడవరం మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్ర మాన్ని స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఈఓ సింహాచలం గారు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులో భయాన్ని పోగొట్టేందుకు నమూనా పరీక్ష దోహదప డుతుందన్నారు. మొదటిసారి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు భయం, ఆందోళన చెందవద్దన్నారు. పదో తరగతి మీ భవిష్యత్తుకు తొలి మెట్టు అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న సమయం లో ఎక్కువ సమయం చదువుకు కేటాయించాలన్నారు. బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకువాలన్నారు. ఇలాంటి మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ బృందానికి ప్రత్యేకమైనటువంటి అభినందనలు తెలియజేయడం జరుగుతుందన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణించే విధంగా చదువు అనేది ఉండాలని విద్యార్థులు బట్టి పట్టి చదవడం ద్వారా ఎటువంటి ప్రయోజనం లేదని జ్ఞానంతో కూడిన విద్య అవసరమన్నారు కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబ్జి, విద్యార్థులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబానికి


# వాసవి క్లబ్ ఆర్థిక సాయం



మాడుగల మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాడుగుల మండలం గాదిరాయి గ్రామానికి చెందిన రావాలా వెంకటరమణ కుమార్తె లక్ష్మి ( 44) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందింది. అయితే ఈ ఏడాది అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణారావు క్లబ్ సభ్యులు మరణిస్తే వారి కుటుంబానికి తక్షణ సాయం అందించేందుకు మహాప్రస్థానం చైర్మన్ వీ ఎస్ సెంతాలి కుమార్ సహకారంతోఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద సభ్యులు ఎవరైనా మరణిస్తే వారికి 25 వేల రూపాయలు దహన క్రియలు ఖర్చులు కింద అందజేస్తారు. ఆ పథకంలో భాగంగా కింతలి గాదిరాయి వాసవి క్లబ్ సభ్యురాలు లక్ష్మి మృతి చెందడంతో స్పందించిన ఇంటర్నేషనల్ క్లబ్ వారు అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ శ్రీను సూచనలు మేరకు అనకాపల్లి జిల్లా గవర్నర్ కె పూర్ణిమ ద్వారా సోమవారం సాయంత్రం మృతురాలు కుటుంబ సభ్యులకు మృతదేహం వద్ద అందజేశారు. సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వాసవి క్లబ్ చేపడుతున్న నూతన కార్యక్రమంలో ఇది ఒకటనీ, పెద వర్గాలకు నిలుస్తుందని తెలిపారు గ్రామ సర్పంచ్ పెంటకోట జగన్నాధరావు,శ్రీనాథ్ రమేష్, రావాలా సతీష్, శ్రీనాథ్ అప్పారావు,బత్తుల కొండలరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# వడ్డాది వెంకన్న సేవలో ఎమ్మెల్యే రాజు



బుచ్చయ్యపేట మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ ఆహ్వానం మేరకు వడ్డాదిలో వెంకటేశ్వర స్వామిని మంగళవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దర్శించుకున్నారు.ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు దొండా శ్రీరామ్,ఈఓ టిఎన్ఎస్ శర్మ,ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి ఘనంగా సత్కరించారు. అర్చకులు వేదాశీర్వచనాలు పలికి స్వామివారి జ్ఞాపిక,తీర్థప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి నాగేశ్వరి దేవి, కూటమి నేతలు దొండా సన్యాసిరావు, దొండా నరేష్,మాజీ జడ్పిటిసిలు వియ్యపు అప్పారావు,జి కోటేశ్వరరావు,తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## గోవాడ షుగర్ రైతులు, కార్మికుల బకాయిలు

# తక్షణమే విడుదల చేయాలి



## సిపిఎం డిమాండ్

చోడవరం, మార్చి 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గోవాడ షుగర్ ఫ్యాక్టరి రైతు,కార్మికులకు తక్షణమే భకాయిలు చెల్లించాలని,ఆదుని కరణకు 350 కోట్లు తక్షణ సాయం 35 కోట్లు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనువాసురావు డిమాండ్ చేసారు,సోమవారం గోవాడ ఘగర్ ఫ్యాక్టరిని సందర్శించి చేరుకు రైతులతో మాట్లాడారు, రాష్ట్రంలోనే సహకారంగంలో నడుస్తున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదు కోవడంలో తీవ్ర వైఫల్యం చెందిందని,తెలిపారు దీని పర్యవసానంగా రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పాలు అవుతున్నారని అన్నారు రాష్ట్రంలో సహకార రంగంలో మిగిలిన ఏకైక గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడక పోతే ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ జపం చేస్తున్న చంద్రబాబు గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ కు ఎందుకు చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రభుత్వం తక్షణ సాయంగా 35 కోట్లు,ఆధునీకరణ కై 350 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ వద్ద ఎంతో పలుకుబడి ఉన్న వ్యక్తిగా చెప్పుకుంటున్న స్థానిక ఎంపీ సి ఎం రమేష్ ఫ్యాక్టరీ కోసం ఎందుకు మోడీని అడగట్లేదని అన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పదేపదే ఢిల్లీ చుట్టూ తిరుగుతున్న సిఎం రమేష్ ఘగర్ ఫ్యాక్టరి లను ఆదుకుంటామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదని అన్నారు రైతులు,కార్మికుల కష్టంతో నిర్మించబడి ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కోసం ఒక్కసారైనా ఎందుకు ఢిల్లీ వెళ్లలేదని అడిగారు. ఫ్యాక్టరీని మూసివేస్తే దీనికి ఎలా సొంతం చేసుకోవాలనే ఆలోచన ఇక్కడ ప్రజాప్రతి నిధులకు ఉన్నట్టు కనిపిస్తుందని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే దీన్ని పూర్తి సామర్థ్యంతో నడుపుతానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఫ్యాక్టరీ నేటి ఉన్న దుస్థితి నుంచి బయట పడేయటానికి అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా చర్చించి నిధులను ఎందుకు రావట్లేక పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని సహకార రంగంలో ఉండే ఏకైక ఫ్యాక్టరీని కాపాడడం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఫ్యాక్టరీ ఆధునీకరణ, రైతులు, కార్మికుల బకాయిల కోసం పెద్ద ఎత్తున పోరాదుతుందని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉందంటే దానికి కారణం, కన్నతల్లి లాంటి షుగర్ ఫ్యాక్టరీని నేడు మూసివేత దిశగా తీసుకొని వెళ్ళటం అన్యాయం అన్నారు. ఫ్యాక్టరీ ఆధునికరణ, నిధులు విడుదలకై ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, ఆర్ శంకర్రావు, జి శ్రీ రామ్, జిల్లా కమిటీ సభ్యులు వి.వి. శ్రీనివాసరావు, జి. వరలక్ష్మి, ఈ. నరసింహమూర్తి, దొర, దేముడు నాయుడు, గండి నాయనబాబు, కర్రి అప్పారావు, సాంబశివరావు, నాగిరెడ్డి సత్యనారాయణ,ఇర్లే నాయుడు వి సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.తో పాటు అదికసంఖ్యలో రైతులు కార్మికులు పాల్గొన్నారు.

## ఎవరినీ బాధ పెట్టాలనే
# ఉద్దేశం నాకు లేదు: రోహిత్ శర్మ



**బెంగళూరు : ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్, ఫైనల్స్‌లో భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్.. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్‌ల ఆగ్రహానికి గురైన సంగతి తెలిసిందే. బౌలింగ్ వేసిన అనంతరం కుల్‌దీప్ స్టంప్స్ వెనక ఉండకపోవడం.. త్రో విసిరిన బంతిని పట్టుకోకపోవడమే ఇందుకు కారణం. ఫైనల్ మ్యాచ్‌లో 41వ ఓవర్‌లో కుల్‌దీప్ విసిరిన బంతిని పాయింట్‌లోకి నెట్టి ఓ సింగిల్‌ను తీయడానికి బ్రాస్‌వెల్ ప్రయత్నించాడు.**

అదే సమయంలో రవీంద్ర జడేజా మెరుపువేగంతో బంతిని అందుకొని నాన్‌స్ట్రైకర్ వైపు విసిరాడు.. అది వికెట్లకు చాలా దగ్గర నుంచి వెళ్లింది. అక్కడే ఉన్న కుల్‌దీప్ స్టంప్స్ వెనక్కి చేరి బంతిని పట్టుకోవడానికి ప్రయత్నించలేదు. ఆసీస్‌తో సెమీస్ సందర్భంగా కూడా స్టీవ్‌స్మిత్ ఆడిన బంతిని ఇలానే చేయడంతో.. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లి తమదైన శైలిలో హెచ్చరించారు. ఈవిషయంపై ఫైనల్ మ్యాచ్ అనంతరం రోహిత్ మాట్లాడాడు. మైదానంలో భావోద్వేగాలు తీవ్రస్థాయిలో ఉంటాయని, అలాంటి సమయంలో అప్పుడప్పుడు తాను నియంత్రణను కోల్పోతానని రోహిత్ పేర్కొన్నాడు.

'మాకు బలమైన జట్టు ఉంది. అలాంటి నిబద్ధత కలిగిన వ్యక్తులతో కలిసి ఆడటం చాలా ఆనందంగా ఉంది. ప్రతిఒక్కరికి వారి పాత్ర, బాధ్యతలు తెలుసు. అయితే, మైదానంలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. కొన్నిసార్లు నేను కొంచెం నియంత్రణ కోల్పోతా. కానీ ఇదంతా ఆటలో భాగం. మైదానంలో అనే మాటలు ఎవరినీ బాధ పెట్టడానికి కాదు. అవి ఆటపై మనకున్న అభిరుచిని వ్యక్తపరుస్తాయి. ఏదేమైనా మా అందరి లక్ష్యం గెలుపే. దాన్ని సాధించేందుకు ఏం చేయడానికైనా మేము సిద్ధంగా ఉన్నాం. ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదు మ్యాచ్‌ల్లోనూ టాస్ ఓడిపోయాం. అయినప్పటికీ టైటిల్ గెలిచాం. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా టోర్నీ విజేతగా నిలవడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది' అని రోహిత్ వివరించాడు.

న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ విజయం సాధించడంలో కుల్‌దీప్ యాదవ్ పాత్ర కూడా ఉంది. కీలక సమయంలో డేంజరస్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర (37), విలియమ్సన్ (11)ను ఔట్ చేసి కివీస్‌ను దెబ్బకొట్టాడు.

## ఆర్సీబీ కోహ్లీ @18..
# ఢిల్లీ వద్దనుకుంది.. బెంగళూరు పట్టేసింది




**బెంగళూరు : ఐపీఎల్‌లో అత్యధిక ప్రేక్షాకదరణ పొందుతున్న ఫ్రాంఛైజీల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకటి. ఆర్సీబీకి భారీగా అభిమానగణం ఉందంటే అందుకు ప్రధాన కారణం విరాట్ కోహ్లీ అని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఐపీఎల్ ఆరంభం నుంచే రికార్డుల మీద రికార్డులు సృష్టించిన కోహ్లీ ఆర్సీబీలో చేరి నేటికి సరిగ్గా18 ఏళ్లు అవుతోంది. 2008 అండర్-19 ప్రపంచ కప్‌లో కోహ్లీ 235 పరుగులు చేసి భారత్ టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో విరాట్‌ను దక్కించుకోవడానికి పలు ఫ్రాంఛైజీలు ఆసక్తి చూపాయి.**

కానీ, ఢిల్లీ డేర్‌డెవిల్స్ లోకల్ బాయ్ కోహ్లీని కాదని ఢిల్లీకే చెందిన బౌలర్ ప్రదీప్ స్వాంగాన్‌ను తీసుకుంది. వీరేంద్ర సెహ్వాగ్, ఏబీ డివిలియర్స్ వంటి బ్యాటర్లు జట్టులో ఉండటంతో మరో బ్యాటర్ అవసరం లేదని ఢిల్లీ డేర్‌డెవిల్స్ కోహ్లీని వద్దనుకుంది. దీంతో కోహ్లీని ఆర్సీబీ సొంతం చేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు విరాట్ బెంగళూరు తరఫునే ఆడుతున్నాడు. ఐపీఎల్ చరిత్రలో అన్ని సీజన్లలో ఒకే జట్టుకు ఆడిన ఆటగాడిగా కోహ్లీ రికార్డు సృష్టించాడు.

కెప్టెన్‌గా కోహ్లీ ఆర్సీబీకి టైటిల్ అందించలేక పోయినప్పటికీ బ్యాటర్‌గా అదరగొట్టాడు. 252 మ్యాచ్‌ల్లో 8 సెంచరీలు, 55 హాఫ్ సెంచరీల సాయంతో 8,004 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో అత్యధిక రన్స్ చేసింది కోహ్లీనే. 2013-2021 మధ్య ఆర్సీబీకి నాయకత్వం వహించిన విరాట్.. 2016 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లోనే 973 పరుగులు చేసి జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2022 సీజన్‌కు ముందు కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలిగి ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే.

# భారత రెజ్లింగ్ సమాఖ్యపై సస్పెన్షన్ ఎత్తివేత




**దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్యపై ఉన్న సస్పెన్షన్‌ను మంగళవారం క్రీడా మంత్రిత్వశాఖ ఎత్తివేసింది. దేశీయ టోర్నమెంట్ల నిర్వహణ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు జాతీయ జట్ల ఎంపిక నిమిత్తం ఈ నిర్ణయం తీసుకుంది. లైంగిక వేధింపుల ఆరోపణలతో సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా సాక్షి మలిక్, బజ్‌రంగ్ పునియా, వినేశ్ ఫొగాట్ తదితర రెజ్లర్లు పోరాటం చేసిన సంగతి తెలిసిందే. దాంతో కొత్త అధ్యక్షుడి కోసం సమాఖ్యకు ఎన్నికలు నిర్వహించారు.**

వాటిలో బ్రిజ్‌భూషణ్ నమ్మిన బంటు సంజయ్‌సింగ్ గెలిచాడు. అనంతరం కొత్త పాలకవర్గం అత్యుత్సాహం ప్రకటించింది. డబ్ల్యూఎఫ్ఐ నియమావళికి విరుద్ధంగా అండర్-15, 20 జాతీయ ఛాంపియన్‌షిప్స్ నిర్వహిస్తామని ప్రకటించడం, పాత కార్యవర్గం (పరోక్షంగా బ్రిజ్‌భూషణ్) నియంత్రణలోనే ఇంకా సమాఖ్య ఉండటం లాంటి కారణాలతో 2023 డిసెంబర్ 24న భారత రెజ్లింగ్ సమాఖ్యపై క్రీడాశాఖ సస్పెన్షన్ విధించింది. ఇంతకాలం డబ్ల్యూఎఫ్ఐ రోజువారీ కార్యకలాపాలను అడ్‌హక్ కమిటీ చూసుకుంది. తాజాగా సస్పెన్షన్‌ను ఎత్తివేసింది.

గడువు లోపు ఎన్నికలు నిర్వహించనందుకు 2023 ఆగస్టు 23న డబ్ల్యూఎఫ్ఐపై యుడబ్ల్యూడబ్ల్యూ(యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్) నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఆరు నెలల అనంతరం ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.

## అది జోక్ కాదు సంజనా..
# బుమ్రా భార్యతో కేఎల్ రాహుల్



**యూఏఈ : టీమ్ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ 2025ని సాధించడంలో స్పిన్నర్లది కీలక పాత్ర. యూఏఈ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తాయనే అంచనాలతో ఏకంగా ఐదుగురు స్పిన్నర్లను జట్టులోకి తీసుకుంది. వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ స్పెషలిస్ట్ స్పిన్నర్లు కాగా.. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్లు. సుందర్‌కి తప్ప మిగిలిన నలుగురికి ఆడే అవకాశం దక్కింది. టోర్నీలో మన స్పిన్నర్లందరూ కలిసి 26 వికెట్లు తీశారు. మన స్పిన్నర్లు పరుగులు కట్టడి చేస్తూ వికెట్లు తీయడానికి ఏవిధంగా కష్టపడ్డారనే దానికి వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ సాక్ష్యం.**

వికెట్ల వెనక ఉండే అతను బౌలర్లు ఏవిధంగా బౌలింగ్ చేస్తున్నారో స్పష్టంగా గమనించాడు. ఫైనల్ మ్యాచ్ అనంతరం కేఎల్ రాహుల్‌ని బుమ్రా భార్య, టీవీ ప్రజెంటర్ సంజనా గణేశన్ ఇంటర్వ్యూ చేశారు. ఈసందర్భంగా భారత స్పిన్నర్లకు సంబంధించి సరదా అంశం ఏంటి? అని రాహుల్‌ని సంజనా అడిగారు. దీనికి రాహుల్ వెంటనే 'జోక్ కాదు సంజనా.. నేను స్పిన్నర్ల బౌలింగ్‌లో వికెట్ల వెనుక 200-250 సార్లు కుర్చోవడం, లేవడం చేయాల్సి వచ్చింది' అని సమాధానమిచ్చాడు. 'భారత స్పిన్నర్లు ఎంతో ప్రతిభావంతులు. పిచ్‌లు కూడా వారికి కొంత సహకరించాయి. ఇది వారిని మరింత ప్రమాదకరంగా మార్చింది. పిచ్‌లు స్పిన్‌కు అనుకూలించడంతో స్టంప్స్ వెనక నాకు మరింత సవాలు ఎదురైంది. మన స్పిన్నర్లు బౌలింగ్ చేసిన విధానం, వారు ఆ పరిస్థితులను ఉపయోగించుకున్న తీరు అసాధారణంగా ఉన్నాయి. ఐసీసీ టోర్నీల్లో ఛాంపియన్‌గా నిలవడం అంత సులువు కాదు. ఇది నాకు మొదటి ఐసీసీ టైటిల్. కాబట్టి.. చాలా సంతోషంగా ఉన్నా. ఇది పూర్తిగా జట్టు విజయం. అందరూ తమ అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. మేం విజయం సాధించడానికి ప్రధాన కారణాలలో ఇది ఒకటి' అని రాహుల్ పేర్కొన్నాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీలో అసలైన
# 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అతడే: అశ్విన్




**యూఏఈ : ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఆద్యంతం ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన టీమ్ఇండియా.. అజేయంగా కప్పును ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్‌లో కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న భారత సారథి రోహిత్‌శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించగా.. న్యూజిలాండ్ ఆటగాడు రచిన్‌రవీంద్ర 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. అయితే, దీనిపై టీమ్ఇండియా మాజీ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. రచిన్‌కు బదులుగా భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఈ అవార్డుకు ఎంచుకోవాల్సిందని అభిప్రాయపడ్డాడు.**

తన యూట్యూబ్ ఛానల్ 'యాష్ కి బాత్'లో దీనిపై మాట్లాడిన అశ్విన్.. వరుణ్‌పై ప్రశంసలు కురిపించాడు. "ఏదేమైనా.. నా దృష్టిలో ఛాంపియన్స్ ట్రోఫీ 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' మాత్రం వరుణ్ చక్రవర్తే. అతడు టోర్నీ మొత్తం ఆడకపోవచ్చు. కానీ, ఆడిన మ్యాచ్‌లో పెనుప్రభావం చూపించాడు. వరుణ్ లేకపోతే భారత గేమ్ మరోలా ఉండేదేమో..! అతడో 'ఎక్స్' ఫ్యాక్టర్. గ్లెన్ ఫిలిప్స్‌ను అతడు ఔట్ చేసిన విధానం అద్భుతం. నేనే జడ్జినైతే ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ వరుణ్‌కే ఇచ్చేవాడిని. అందుకు అతడు అర్హుడే" అని వ్యాఖ్యానించాడు.

కాగా.. ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో వరుణ్ చక్రవర్తిని ముందుగా తీసుకురావడంపై అశ్విన్ చేసిన పోస్ట్ విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే. ఇది తనను ఆశ్చర్యానికి గురిచేసిందని.. సరైన నిర్ణయం కాదని పేర్కొన్నాడు. దీంతో పలువురు అభిమానులు మాజీ క్రికెటర్‌పై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో తన పోస్ట్‌పై అశ్విన్ క్లారిటీ ఇచ్చాడు. "నేను పెట్టిన ట్వీట్ కెప్టెన్సీ గురించి అని భావించడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అభిమానుల పిచ్చితనం ఇది. వరుణ్‌ను ముందుగానే బౌలింగ్ అటాక్‌లోకి తేవాలని.. న్యూజిలాండ్ ఆటతీరు మనపై ఎలా ఒత్తిడి తెచ్చిందో చెప్పడానికే ఆ ట్వీట్" అని వివరణ ఇచ్చాడు.

ఫైనల్ మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు వికెట్లు తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా ఈ టోర్నీలో 9 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో మ్యాట్ హెన్రీ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.



# పుష్ప 2 కావేరి.. చీరలో అందాల మెరుపులా..

**'పుష్ప 2' సినిమా విజయం సాధించడంతో అందులోని ప్రతి పాత్రకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది.**

'పుష్ప 2' సినిమా విజయం సాధించడంతో అందులోని ప్రతి పాత్రకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ గా నిలిచింది. ఇందులో 'కావేరి' పాత్రలో నటించిన పావని కరణం ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోటోషుట్‌లతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ఎప్పుడూ సింపుల్ లుక్‌లో కనిపించే పావని, తాజాగా స్టైలిష్ ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోతూ కుర్రాళ్ల గుండెల్లో దడ పుట్టిస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే పావని, తాజాగా గోల్డెన్ శారీలో దిగిన ఫోటోలను షేర్ చేసింది. ప్రాముఖ్యమైన అవార్డు షో కోసం స్టైలింగ్ అన్నీ స్వయంగా చేసుకున్నానని తెలిపింది. ఆమె కర్లీ హెయిర్, మినిమల్ మేకప్, జ్యువెలరీతో ఓ రాయల్టీ ఫీల్‌ను తీసుకువచ్చింది. సింప్లిసిటీ లో ఉండే అందాన్ని మరోసారి నిరూపించిన ఈ లుక్స్, నెటిజన్లను మాయ చేస్తున్నాయి. న్యెట్ లైట్స్ లో ఆమె ఫోజ్ చేసిన ఫోటోలు హాట్ టాపిక్ గా మారాయి. పావని కరణం కెరీర్ విషయానికొస్తే, ఆమె 'పరేషాన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. "సమోసా తింటావా శిరీష?" అనే డైలాగ్ ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చిన్నా చితకా సినిమాల్లో నటించిన ఈ అమ్మడు, 'పుష్ప 2'లో కీలక పాత్ర పోషించడం ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అయ్యింది. పుష్ప రాజ్ అన్నయ్య కూతురుగా 'కావేరి' పాత్రలో నటించి ప్రేక్షకుల మనసులు దోచుకుంది. ఆ సినిమాలో తన నటన ఎంత బలమైనదో ఇప్పుడు ఈ ఫోటోషుట్‌లోనూ తన గ్లామర్‌తో మరోసారి నిరూపిస్తోంది. సాధారణంగా నటీనటులు వెస్టన్ లుక్స్‌లో హాట్ ఫోటోషుట్‌లు చేస్తుంటారు. కానీ పావని ట్రెడిషనల్ లుక్‌లోనూ అందాన్ని చాటుకోవచ్చు అని ప్రూవ్ చేసింది. ఎప్పుడూ మోడరన్ లుక్‌లో కాకుండా, సింప్లిసిటీ లోనూ ఎంత అద్భుతంగా మెరిసిపోవచ్చో ఈ ఫోటోలు చెబుతున్నాయి. అంతే కాకుండా అవార్డును పట్టుకుని ఇచ్చిన పోజులు ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ లా నిలిచేలా ఉన్నాయి. త్వరలో పావని మరిన్ని వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటించే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది.



# క్యూట్ జాన్వీ కపూర్‌ని చూశారా!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా కాలం అయింది. ఈమె అక్కడ పెద్దగా సక్సెస్‌ను దక్కించుకోలేక పోయింది. అయినా సోషల్ మీడియాలో ఉన్న పాపులారిటీ కారణంగా ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమెకు దక్కిన గుర్తింపు కారణంగా బాలీవుడ్‌లో ఫ్లాప్‌లు పడ్డా వరుసగా ఆఫర్లు అయితే వచ్చాయి. తాజాగా తెలుగులో ఎన్టీఆర్‌కి జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో దేవర సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో మొదటి కమర్షియల్ బ్రేక్‌ను దక్కించుకుంది. తెలుగులో ఈ అమ్మడు ప్రస్తుతం రామ్ చరణ్‌కి జోడీగా నటిస్తున్న విషయం తెల్సిందే. ఎన్టీఆర్‌తో దేవర సినిమాలో నటించి నటిగా ఆశించిన స్థాయిలో అలరించలేక పోయిన జాన్వీ కపూర్‌కి ప్రస్తుతం నటిస్తున్న రామ్ చరణ్ మూవీతో కచ్చితంగా మంచి మార్కులు వస్తాయని అంతా భావిస్తున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న సినిమాలో జాన్వీ కపూర్ పల్లెటూరు అమ్మాయిగా కనిపించబోతుంది. బుచ్చిబాబు మొదటి సినిమా ఉప్పెనలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. కనుక ఈ సినిమాలోనూ జాన్వీ కపూర్ పాత్రకు మంచి ప్రాముఖ్యత ఉండటం ద్వారా టాలీవుడ్‌లో ఈ అమ్మడు మరింతగా ప్రేక్షకులకు చేరువ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. ప్రతి సారి జాన్వీ కపూర్ ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఏ ఔట్ ఫిట్‌లో అయినా జాన్వీ కపూర్ చాలా అందంగా ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. అలాంటి ఫోటోలను షేర్ చేసే జాన్వీ కపూర్ తాజాగా మరో సారి తన క్యూట్ ఫోటోలను షేర్ చేసింది. ఒక డ్రింక్‌ను తాగుతూ క్యూట్‌గా నవ్వుతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన జాన్వీ కపూర్ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంత క్యూట్‌గా ఉండటం జాన్వీ కపూర్ కే సాధ్యం అంటూ కొందరు నెటిజన్స్ సోషల్ మీడియా ద్వారా కామెంట్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తున్న జాన్వీ కపూర్ మరో వైపు బాలీవుడ్‌లోనూ అదే జోరును కొనసాగిస్తోంది. తెలుగులో ఈ అమ్మడు చేస్తున్న సినిమా ప్రస్తుతం ఒకేటే అనే విషయం తెల్సిందే. రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబో మూవీ కాకుండా జాన్వీ కపూర్ మరో అవకాశంను తన ఖాతాలో వేసుకుందనే వార్తలు వస్తున్నాయి. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో జాన్వీ కపూర్ ఒక హీరోయిన్‌గా ఎంపిక అయిందట. సినీ వర్గాల ద్వారా అందుతున్న ప్రచారం ప్రకారం అల్లు అర్జున్‌తో అట్లీ రూపొందిస్తున్న సినిమాలు నలుగురు లేదా ఐదుగురు హీరోయిన్స్ నటించనున్నారట. అందులో మెయిన్ హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేశారని టాక్ వినిపిస్తుంది. పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

# ప్రధాన పాత్రలో నటించనున్న లావణ్య త్రిపాఠి



మెగా హీరో వరుణ్ తేజ్ వివాహం అనంతరం లావణ్య త్రిపాఠి కెరీర్‌పై అనేక ఊహాగానాలు జరిగాయి. పెళ్లి తర్వాత సినిమాల్లో కొనసాగుతారా? లేదా? అనే సందేహాలకు లావణ్య త్రిపాఠి క్లారిటీ ఇచ్చేశారు. కొంత గ్యాప్ తీసుకున్న ఆమె, సతీ లీలావతి అనే ఓ సెన్సిబుల్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటిస్తుండగా, దేవ్ మోహన్ హీరోగా కనిపించనున్నారు. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్‌లపై ఆనంది ఆర్ట్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తుండగా, బినేంద్ర మీనన్ సినిమాటోగ్రాఫర్‌గా, సతీష్ సూర్య ఎడిటర్‌గా పని చేస్తున్నారు.


# బాహుబలి-2ని మించిన చావా వసూళ్లు

బాలీవుడ్ ప్రేక్షకులను అలరించే చిత్రం 'ఛావా' ఇటీవల బాక్సాఫీసు వద్ద మంచి కలెక్షన్లు సాధించి, చర్చనీయాంశమైంది. విక్కీ కౌశల్ మరియు రష్మిక మందన్న ప్రధాన పాత్రలలో నటించిన ఈ చారిత్రక చిత్రం, ప్రేక్షకుల నుండి ప్రశంసలు పొందింది. మరియు నెగటివ్ విమర్శలు లేకుండా ఆకట్టుకుంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం, నిజమైన చరిత్ర ఆధారంగా రూపొందించబడిన కథతో ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది.

ఈ చిత్రం 25 రోజుల్లోనే 'బాహుబలి-2' బాలీవుడ్ కలెక్షన్ల రికార్డును అధిగమించిందని ప్రకటించడం నిజంగా గొప్ప విజయంగా భావించబడింది. బాహుబలి-2, రాజమౌళి మరియు ప్రభాస్ జోడీతో వచ్చిన పెద్ద బడ్జెట్ చిత్రం, రూ.. 510 కోట్లు వసూలు చేసింది. కానీ, 'ఛావా' చిత్రం 25 రోజుల్లోనే రూ.516 కోట్లు వసూలు చేసి, ఈ రికార్డును దాటేసింది.

**ఛావా 6వ స్థానంలో**

'ఛావా' ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రాల్లో 6వ స్థానంలో నిలిచింది. ఈ చిత్రం యొక్క చారిత్రక, పౌరాణిక కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, జాతీయ స్థాయిలో సైతం మంచి విజయం సాధించింది.



**చిత్రం కథ మరియు పాత్రలు**

ఈ చిత్రంలో విక్కీ కౌశల్ తన నటనతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన, 'శంభాజీ మహరాజ్' పాత్రలో నటించి, దాదాపు ప్రతి ప్రేక్షకుడి హృదయాలను గెలుచుకున్నాడు. ఆ విధంగా, ఈ చిత్రం పౌరాణిక నేపథ్యం ఆధారంగా భారతీయ చరిత్ర ను తెరపై అలరిస్తుంది. రష్మిక మందన్న కథలో కీలక పాత్ర పోషించారు.

**ఛావా: సినిమా కోసం ప్రేక్షకులు ఇచ్చిన ప్రేమ**

'ఛావా' చిత్రం, సినిమా మాధ్యమంతో భారతీయ చరిత్రను గౌరవిస్తూ, వీరభద్రులు మరియు భారతదేశ స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంతో ప్రేక్షకులను ఆసక్తిగా ఉంచుతోంది. ఈ చిత్రం విజయానికి ప్రధాన కారణం ప్రేక్షకుల ప్రేమ అనే చెప్పాలి.

**ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయం**

ప్రేక్షకులు సినిమా చూసిన తరువాత ఆకట్టుకున్న అద్భుత నటన, నైపుణ్యం, దృశ్య రూపకల్పన, కథ మరియు సాంకేతిక విభాగం అన్ని ఈ చిత్రాన్ని బాక్సాఫీసు వద్ద విజయం సాధించడానికి కారణమయ్యాయి.

**ఫిబ్రవరి 14న విడుదల**

'ఛావా' చిత్రం ఫిబ్రవరి 14, 2025న విడుదలైంది, మరియు అదే రోజు వాలంటైన్స్ డే కావడంతో, ప్రేమకథా చిత్రాలు ప్రేక్షకుల లో మరింత ఆసక్తిని పెంచాయి. ఆ సందర్భంలో విడుదలైన ఈ చిత్రం, ప్రేమ మరియు దేశభక్తి అంశాల సంగమాన్ని ప్రదర్శించుకుంటూ, విపరీతమైన ఆదరణ పొందింది.

**దిశాబద్ధమైన విజయం**

'ఛావా' చిత్రం విజయంతో, విక్కీ కౌశల్, రష్మిక మందన్న, మరియు లక్ష్మణ్ ఉటేకర్ కి హ్యాట్రిక్ విజయాలను ఇచ్చింది. ఈ చిత్రం తమ తమ రంగాల్లో మరింత శక్తివంతమైన జోడి అని నిరూపించుకుంది.

**కావలసిన పోటీ**

ఇంకా, ఛావా చిత్రం తన విజయంతో సినిమా రంగంలో మరిన్ని పోటీలు మరియు విచారణలు మొదలయ్యాయి. బాలీవుడ్ వంటి పెద్ద పరిశ్రమలో ఏ సినిమా పెద్దగా వ్యాపించగలదో? ఇది అందరికీ ప్రేరణగా మారింది.



# అనసూయ గోల్డెన్ రాయల్ లుక్.. స్టన్నింగ్!

ఆకుపచ్చ-బంగారు రంగుల పట్టు చీరలో, జరీ అంచుతో మెరిసిపోతూ, విలక్షణమైన ఆభరణాలతో, గజ్జెలు, బిగిన గాజులతో సంప్రదాయాన్ని చాటింది. అనసూయ భరద్వాజ్.. నాన్ గ్లామర్ లుక్‌లో కూడా తనదైన స్టైల్‌తో కట్టిపడేస్తుంటుంది. ఎప్పుడూ ట్రెండీ లుక్స్‌లో దర్శనమిచ్చే ఈ భామ ఈసారి సంప్రదాయ వస్త్రధారణలో కనిపించింది. ఆకుపచ్చ-బంగారు రంగుల పట్టు చీరలో, జరీ అంచుతో మెరిసిపోతూ, విలక్షణమైన ఆభరణాలతో, గజ్జెలు, బిగిన గాజులతో సంప్రదాయాన్ని చాటింది. ఈ ఫోటోషుట్‌లో అనసూయ తన ఎక్స్‌ప్రెషన్స్‌తో, హావాభావాలతో మరోసారి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. రెడ్ బ్యాక్‌డ్రాప్ ముందు కూర్చొని, ఖద్దరు సెట్‌లో రాజసంగా కనిపించిన అనసూయ.. తన హుందాతనాన్ని, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించేలా కనిపించింది. వెండితెరపై ఎప్పుడూ స్టైలిష్ లుక్స్‌లో కనిపించే ఆమె ఈసారి రాయల్ లుక్‌లో సరికొత్త అందాన్ని చూపించింది. క్లాసిక్ డిజైన్ బ్లౌజ్, మట్టి రంగుల్లో తళుకులీనే నాజూకైన నగలు ఆమె అందాన్ని మరింత పెంచాయి. కెమెరా ముందు అనసూయ ఇచ్చిన స్టిల్స్ చూస్తుంటే ఆమె స్టైలింగ్‌కు ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టిందని అర్థమవుతోంది. ఆమె చూపులు, హుందాతనం కలిగిన భంగిమలు.. ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫోటోషుట్‌ను షేర్ చేసిన అనసూయపై అభిమానులు కామెంట్స్, లైక్స్‌తో ఓ రేంజ్‌లో స్పందిస్తున్నారు. ట్రెండీ దుస్తులు, మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌తోనే కాకుండా.. ఇలాంటి సంప్రదాయ సాంప్రదాయ దుస్తుల్లో కూడా అనసూయకు ఎంతలా కుదిరిందో ఈ ఫోటోలు చెబుతున్నాయి. ఆమె ఎక్కడి లుక్ అయినా ఒంటి చేసుకుని మెరిసిపోవడం ఆమె ప్రత్యేకత. మరీ ముఖ్యంగా ఈ పట్టు చీరల లుక్‌లో అనసూయ ఎంతో గ్రేస్‌తో కనిపించడం విశేషం. సినీ రంగంలో నటిగా, యాంకర్‌గా, సోషల్ మీడియాలో ఫ్యాషన్ ఐకాన్‌గా మారిన అనసూయ.. ఈ ఫోటోషుట్ ద్వారా మరోసారి తన ట్రెండ్ సెట్టింగ్ స్టైల్‌ను నిరూపించింది. ఆమె అందాన్ని పొగుడుతూ అభిమానులు కామెంట్స్‌తో హోరెత్తిస్తున్నారు. ఇక ప్రస్తుతం ఆమె తెలుగులో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339